

# దేవుడూ! నీమతమేమిటి?

ఎమ్.కె.ఎస్. ప్రకాశరావు

ఫోన్ రింగవుతోంది. సంతకాలు పెడుతున్న ఫైల్స్ ●క్కకు నెట్టి ఫో నందుకున్నాను. విన్న కబురుకు మెదడు ఒక్క సారి మొద్దుబారి నట్లైంది. ఫాదర్ గాబ్రియల్‌కు ఆరోగ్యం బాగా లే దట. మద్రాసు తీసుకు వెడుతున్నామని, మీకు తెలియపరచమని ఫాదర్ చెప్పారని, క్వార్టర్స్ నుండి కబురు వారం క్రితమేగా తను ఆయనని కలిసి వచ్చాడు. క్వార్టర్స్ నుండి కాలేజీ కాంపస్ వరకు బైబిల్ మెల్లగా చదువుకుంటూ తనని చూడగానే 'హల్లో మై బోయ్ కమాన్' అంటూ దగ్గరకు తీసుకుని తనతో బ్రేక్ ఫాస్ట్ తీసుకుంటే కాని వద ల్లేదు. వారంలోనే మద్రాసు తీసు కెళ్లేంత అనారోగ్య మేమిటి? హడావుడిగా ఇంటికి ఫోన్ చేసి, సుధకి విషయం చెప్పి, బేబీ కూడా వస్తానంటే రెడీ అవమని చెప్పాను. ఫోన్ పెట్టేస్తుంటే మనసు గతంలోకి పరుగులు తీసింది.

తను టెన్త్ పాసై, ఇంటర్‌లో చేరటానికి విజయవాడ వచ్చిన రోజులు. అప్పటి వరకు అమ్మ చేతి భోజనం, ఇంట్లో వాళ్లతో హాయిగా గడిపిన తను, ఒక్కసారిగా పారుగూరులో చదవటానికి రావటం, అందులో హాస్టలు భోజనం, ఒంటరిగా గదిలో ఉండాల్సి రావటం, బిక్కు బిక్కు మనిపించింది. అన్నయ్య కాలేజీలో 'ఫీజ్ కట్టి, హాస్టల్‌లో చేర్చి, ఊళ్లో దగ్గర బంధువు లుంటే వాళ్లకు కూడా అప్పగింతలు, తనకు జాగ్రత్తలు చెప్పి వెళ్లిపోయాడు.

మామూలుగా తనకు ఉదయమే లేవటం అలవాటు. తెల్లవారు జామున పెరుగు కుండ చేతికి తీసుకుంటూ, అమ్మ తనను కూడా లేపేది. మజ్జిగ చిలుకుతుంటే కవ్వం చుట్టుడుతో పాటు ఆమె పాడే ఊర్మిళాదేవి నిద్ర, గోవింద నామాలు, భజ గోవిందం సన్న సన్నగా వినిపిస్తుంటే, వరండాలో కూర్చుని తను చదువుకుంటుండే వాడు. ఆ అలవాటు పె ద్దయాక కూడా పోలేదు. అదే అలవాటు చొప్పున ఉదయమే పుస్తకం పట్టుకుని గది బైట మొక్కల్లోకి వచ్చే సరికి మొదట కన్పించింది ఈ ఫాదరే. 'హల్లో మై బోయ్ కమాన్' అంటూ పిలిచారు. బితుకు బితుకు మంది గుండె.

పచ్చటి విగ్రహం, మోకాళ్ల వరకు తెల్లటి గౌను, మెళ్లో శిలువ లాకెట్ ఉన్న గొలుసు - నిండుగా, గంభీరంగా ఉన్న ఆయన పిలుస్తుంటే, ఎన్నడూ క్రిస్టియన్ ఫాదర్స్‌ను దగ్గరగా చూడని మొహ న్నేమో, చమటలు పట్టాయి. భయంతో... దగ్గరగా వెళ్లగానే ''ఏమి చదువుతున్నావు?'' అన్నారు. చెప్పాను. ''ఓహో లెక్కల గ్రూపా.. భావి ఇంజనీర్ అన్న మాట'' అంటూ టెన్త్‌లో ఫస్టు క్లాసు వచ్చిందని చెప్తే, మార్కులు కూడా చెప్పించుకుని చాలా ఆనందంగా అభినందించారు.

''తెలివి గల కుర్రాడివి. జాగ్రత్తగా చదువు. చెడు స్నేహాలు చేయకు.'' ఇలా ఓ పావు గంట బోధించారు. పూర్తిగా అర్థమయీ అవని ఇంగ్లీషుని మననం చేసుకుంటే అర్థమైన మాటలు ఇవి. ఏ సుప్రభాత సమయాన అలా పరిచయం అయిందో కాని, అప్పటి నుండీ ఆయన శిష్యుడై పోయాడు తను. ఒక్క రోజు ఉదయం కన్పించకపోయినా, గది ముందు నిలబడి తలుపు తట్టి ''హలో ప్రసాద్... ఆరోగ్యం బాగుందా?'' అని పలుకరించే వారు. తల్లీ దండ్రీ దగ్గర లేనందుకు ఆయనే సర్వమూ అయ్యారు. నిప్పులు కడిగే ఆచారం ఉన్న ఇంట్లో పుట్టిన తను, ఓ క్రైస్తవునికి ఇంత దగ్గ రయానని తెలిస్తే.. అమ్మో... ఎంత గొడవ చేస్తారో... కాలేజీలో చేర్చే టప్పుడే ఈ కాలేజీ వ ద్దని ఇంట్లో పెద్ద గొడవే అయింది. అన్నయ్యే మొండిగా వాదించి, ''కాలేజీలూ, టీచర్లూ ఏ కులమైతే, మతమైతే మన కెందుకు? వాడికి వచ్చిన మార్కులకు ఇలాంటి మంచి కాలేజీ అయితేనే ముందు ముందు ఇంజనీరింగ్‌లో సీటు కష్టం లేకుండా వస్తుంది. అక్కడి చదువు కావాలి కాని, అక్కడి మనుషుల విషయం మన కెందుక''ని గొడవ చేసి ఇక్కడ చేర్చాడు. 'ఆచార్య దేవో భవ' అన్నందుకు ఈ ఫాదర్ దేవుడే అయాడు తనకు. తన చదువులో ప్రతి అడుగుకు సరియైన ప్రోత్సాహ మిస్తూ ప్రతి మెట్టులో తను ముందుండేలా తీర్చి దిద్ది, ఈనాటి బంగారు భవిష్యత్తుకు బాట వేశారు.

రెండవ సంవత్సరంలో ఉండగా జరిగిన ఓ సంఘటన గుండెల్లో పదిలంగా నిక్షిప్త మయే ఉంటుంది ఎప్పుడూ. సెకండ్ టర్మ్ పరీక్షల ముందు ఎక్కువ సేపు చదువుతూ టెన్షన్‌లో తిండి తినక, సరిగా నిద్ర పోక, చాలా కష్టపడ్డాడు తను. చివరి పరీక్ష రాసి, గదికి రాగానే ఇక జ్వరంతో ఒళ్లు తెలియలేదు. డైనింగ్ హాల్లో తను కన్పించ లేదని స్నేహితులు వెతుక్కుంటే తన పరిస్థితి తెలిసిందట. ఈ వార్త ఫాదర్‌కు తెలియగానే హడావుడిగా వచ్చి, బ్రెడ్, పాలు తెప్పించి ఇచ్చారు. అందరూ సెలవులకు ఊ రెళ్లిపోతే, జ్వరం వల్ల వారం వరకు కదల్లేక పోయాడు. ఇంట్లో కంగారు పడతారని స్నేహితులు అందరూ ఉన్నారని, నాలుగు రోజుల్లో వస్తున్నానని ఇంటికి రాయించారు ఆయనే. ఆ వారం రోజులు ఆయన చేసిన సేవ జీవితాంతం మరువలేనిది. విపరీతమైన జ్వరంతో మూలుగుతూ కలవరిస్తూ పడుకుంటే, ఉడుకులాం పట్టీలు వేస్తూ, వేళకు మందులు వేస్తూ, తెల్లవార్లూ తన పక్కనే కూర్చునే వారు. జ్వరం తగ్గాక ప్రత్యేకంగా రసం చేయించి రసం, మజ్జిగ పథ్యం పెట్టించి, పూర్తి కులాసా చిక్కాక తనే స్వయంగా రైలు ఎక్కించి ఊరికి పంపారు. చిక్కి శల్యమైన తన అవతారం చూసి నాన్న కంటే మరీ అమ్మ ఎంత బాధపడి ఏడ్చిందో! వివరాలు విన్న తర్వాత ఆ కిరస్తానీ మున లాయనకు ఎన్ని దీవెనలు పంపిందో.. ''ఏమో అనుకున్నాను కాని కిరస్తానీ వాళ్లు కూడా మంచి

వాళ్లేరా.'' అమాయకంగా ఆమె అంటుంటే అప్పటి కప్పుడు ఆయన దగ్గరకు తీసుకు వెళ్లి చూపించా లనిపించింది.

—శలవు లయాక తిరిగి వెడుతుంటే, తనకు ఇచ్చేవి కాక ఆయన కోసం, ప్రత్యేకంగా ఇంట్లో కాచిన నెయ్యి, నేతి అరిసెలు, సున్నుండలు, జంతికలు... ఇలా ఎన్నో రకాలు కట్టి ఇచ్చింది అమ్మ. పాపం ఆయన బ్రహ్మచారి. ఎలాంటి దురలవాట్లు లేని అసలు సిసలు ఫాదర్ ఆయన. అవన్నీ తన తోటి వాళ్లకు పంచి తింటూ అమ్మ గురించి చెబ్తే మెచ్చుకుంటుంటే తనకు ఎంత సంతోషం కలిగిందని!! తన క్లాస్ మేట్స్ కొందరు తమాషా పట్టించే వారు. 'ఉల్లిపాయ కూడా తినని మన బాపనయ్యకూ, ఆ ఏసు ప్రభువుకూ స్నేహం చూడరోయ్ ఎలా కలిసిందోనని.. నిజమే... మత మేదైతేనేం.. కుల మేదైతేనేం. మనుమల మనస్తత్వాలు సత్ప్రవర్తనతో కూడినవిగా ఉండాలి గాని. అన్ని మతాలు ఒక్కటేనని తమ బాంధవ్యం చెప్పి నట్లైంది.

"సార్'' అటెండర్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను. దాదాపు గంట సేపు ఈ లోకం మరచిపోయా నన్నమాట!

సుధ కంటే ముందే తయారైందట బేబీ. ఇద్దర్నీ తీసుకుని స్టేషన్‌కు వెళ్లాను. సాధారణంగా సంవత్సరానికి ఒక్క సా రన్నా మా పిల్ల లిద్దర్నీ తీసుకుని సుధ, నేను, ఫాదర్ ఎక్క డున్నా కలవటం అలవాటు. ఇన్ని సంవత్సరాల నుండీ మాకు ఆయనతో ముడిపడిన బంధం అది! కేవలం నాకే కాక, నా భార్యకూ, పిల్లలకూ కూడా ఆయనంటే గౌరవ భావం ఏర్పడటం నా అదృష్టం.

అలాగే ఆయనకు కూడా మా కుటుంబంఅంటే అంత వాత్సల్యం ఎందుకు ఏర్పడిందో నాకే తెలియదు. క్రిస్టమస్‌కు ఆయన ఎక్కడ ఉన్నా మా నలుగురి స్వంత దస్తూరీతో గ్రీటింగ్ కార్డు మీద పేర్లు వ్రాసి పంపాల్సిందే. అలాగే ఉగాది నాటికి అందమైన బాపు బొమ్మలూ క్రింద వచ్చీ రాని తెలుగులో వంకర టింకరగా మా పేర్లు వ్రాసి, మా పిల్లల పేర్ల క్రింద ఆశీస్సులతో తాత' అని రాసి గ్రీటింగ్ పంపటం మా ఫాదర్ ప్రత్యేకత. ఈ ఆనవాయితీ ఇన్నేళ్ల నుండీ భంగం కలుగకుండా జరుగుతూనే ఉన్నది. ఈ సారి బాబు దగ్గర లేనందున బేబీయే ఆయనకు ఇద్దరి తరపున పళ్లు ఇవ్వటానికి పట్టుబట్టి వచ్చింది మాతో.

స్టేష నంతా హడావుడిగా ఉంది. మ కంపార్టుమెంట్ బైట కాలేజీ స్టాఫే కాకుండా, నాలాంటి ఊళ్లో ఉన్న పూర్వ విద్యార్థులు కూడా ఉన్నారు. ఫాదర్ పరిస్థితి కనుక్కుంటే వారం నుండీ జ్వరమనీ, కడుపు నొప్పని ఫాదర్ మామూలు నలతగా భావించి మందులు వాడారట. కాన్సరని.... విన్న నా గుండె క్షణం ఆగి నట్లైంది. ఎనభై ఏళ్ల ఆయన ఆడుతూ పాడుతూ ఆరోగ్యంగా తిరుగుతున్నప్పుడే దాటిపోక, ఈ భయంకరమైన జబ్బు ఆయనకు రావాలా? ఆయన ఎదుటికి ఎలా వెళ్లగలనో నాకే తెలియటం లేదు. కాళ్లు తడబడుతుంటే, గుండె చిక్క బట్టుకుని కంపార్టుమెంట్‌లోకి వెళ్లాను. "హల్లో మై బోయ్.. [అదే పిలుపు... మొదటి రోజు నుండి ఈ రోజు వరకు నన్ను చూడగానే పిలిచే పిలుపు అదే] నీ కోసమే చూస్తున్నాను. బేబీ ఏదీ?'' అంత నీరసంలోనూ నవ్వుతూ పలుకరించారు.

బేబీ పండ్లు అందించి నమస్కారం చేసింది. "బేబీ, ఈ మాత్రం కూడా ఇప్పుడు తినలేను తల్లీ. అయినా దాచిపెట్టుకును రేపు తింటాలే ఏం!'' ఊ... ఏదీ నీ మామూలు తీసుకో. మళ్లీ ఎప్పు డిస్తానో'' అంటూ గౌను జేబులోంచి కాడ్‌బరీ చాక్‌లెట్లు తన చేతిలో పెట్టారు. బేబీ ఎప్పుడు కలిసినా కాడ్‌బరీ ఇచ్చే ఆయన అలవాటును ఇలాంటి పరిస్థితిలోనూ మరచిపోలేదు. సుధ తల మీద చేయి వేసి మృదువుగా నిమిరారు. మాకు దుఃఖం ఆగలేదు. "ఏమిటి ప్రసాద్! నాకు కాన్స రని దిగులు పడుతున్నావా? నథింగ్ టు వర్రీ మెడ్రాస్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుని త్వరలో వచ్చేయనూ.. బేబీ వెడ్డింగ్ రోజు బెస్ట్ విషెస్ చెప్పాలి కదా'' అన్నారు. ఒక్క క్షణం నిరుత్తరుడి నయ్యాను. కాన్స రని ఎలా తెలిసింది? తెలిసినా కూడా ఇలా నవ్వుతూ నిబ్బరంగా ఎలా మాట్లాడుతున్నారు? అదే పక్క నున్న లెక్చరర్ తర్వాత చెప్పారు. అందరూ గుసగుస లాడుతూ హడావుడిగా తిరుగుతుంటే జబ్బే మిటో చెప్పమని ఫాదరే గొడవ చేస్తే. చెప్పేశారట స్టాఫ్. 'మద్రాస్ వద్దు. ఇక్కడే ట్రీట్‌మెంట్ తీసుకుంటా' నన్నారట. కాని అక్కడి విజయా హాస్పిటల్‌లో స్టాఫ్ కొందరు ఆయన పూర్వ విద్యార్థులు. ఇక్కడ నుండి ఫోన్ చేయగానే, రాత్రిలోగా తీసుకు వచ్చేయమని, హడావుడి పెడితే విఐపి స్పెషల్ కోటాలో మద్రాసు తీసుకు వెడుతున్నారు.

బండి కదిలే వేళయింది. వీడ్కోలు ఇవ్వటానికి వచ్చిన ఒక్కొక్కరూ ఆయనకు విష్ చేసి, క్రిందకు దిగుతున్నారు. బేబీ ఆయన చేయి పట్టుకుని 'వెళ్లొస్తా తాత గారూ...ఆరోగ్యంగా మీరు త్వరలో వచ్చేస్తారు. మీరు వచ్చే రోజు డాడీతో నేను ఇక్కడే మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటాను' అంది కన్నీళ్లు పైకి ఉబుకుతుంటే ఆపుకుంటూ.. పసిపిల్లగా ఉన్నప్పుడు బేబీని చూపించాలని ఒక సారి బాబును, సుధను తీసుకుని ఆయన దగ్గరకు వెళ్లాను. బాబుతో 'ఈయన మా ఫాదర్' అని పరిచయం చేయగానే 'అయితే తాత అన్న మాట నాకు' అన్నాడు వెంటనే. ఆయనకు ఆ మాట ఇంగ్లీష్‌లో చెబుతే అంత నిస్వార్థ సేవకుడు, కుటుంబం ఆప్యాయతలు ఎరగని ఆయన ఎంత చలించారో, ఎంతగా కదిలిపోయారో చెప్పలేను. పిల్ల లిద్దరినీ దగ్గరకు తీసుకుని నాకు తండ్రి లాంటి వారు కాబట్టి తను తాత అవుతానని అప్పటి నుండీ అలాగే పిలవ మనేవారు.

"బై బేబీ... ఈ తాతను మరచిపోకు'' అంటూ 'ఇలారా చిన్న మాట' అన్నారు. దగ్గరకు వెళ్లగానే "మీ దేవుడిని నా ఆరోగ్యం కోసం ప్రార్థించు [ప్రే యువర్ గాడ్ ఫర్ మి బేబీ] పిల్లల మాట మీ దేవుడు వింటాడటగా'' అన్నారు. ఒక్క సారిగా అక్క డున్న అందరూ బిత్తరపోయారు. బేబీ ఫెద్దగా ఏడ్చేసింది.

"మీదే కులం? మీ మత మేమిటి? మా కులం వాడివి కాదు నీవు. మా మతం కాదు నీది. మీ మతం వేరు. మీ దేవుడు వేరు. ఈ సీటు నీకు ఇవ్వం" ఇలాంటి మాటలు... మెళ్లో శిలువలు వేసుకుని దేవుడి బిడ్డల మంటూ తిరుగుతారని ఒక మతం వారు... అల్లా అబ్బా అంటారని మరో మతం వాళ్లు, కోటి మంది దేవుళ్లు బాబూ మీకు. ఒక్కొక్కరికి ఎంత మంది భార్యలో.. పిల్లలు పుట్టడం కూడా తమాషానే.. నీతి నియమాలు వరుసలు కూడా ఉండవని మరో మతం వాళ్లూ... ఇలా మత విద్వేషాలతో, కక్షలు కార్పణ్యాలతో, కులాల కుళ్లుతో కంపు కొట్టుకుంటూ కొట్టుకు చస్తున్న ఈ రోజుల్లో ఓ మతం మనిషి, మరో కులానికి సంబంధించిన దేవుడిని తన ఆరోగ్యం కోసం ప్రార్థించ మనటం, [ప్రార్థిస్తే ఆ దేవుడు తనకు ఆరోగ్యం ఇస్తాడని స్వార్థం కాదు ఇక్కడ... మరో మతం మీద ఆయన కున్న నమ్మకం, విశ్వాసం, గౌరవం] అబ్బ.. అనుకుంటుంటే ఎంతో హాయిగా ఉన్నది! అన్ని కులాల వారు, మతాల వారు ఇలాగే ఆలోచిస్తే, కుల మతాల పేరిట నిత్యం జరిగే మారణ హోమాలు, అయోధ్యలో లాంటి విధ్వంసకాండలు ఉండవు కదా! గాంధీజీ కలలు గన్న రామరాజ్యం, సర్వమానవ సౌభ్రాతృత్వం, మతాలు వేరైనా మానవు లంతా ఒక్కటే. దేవు డొక్కడే అన్న బాపూజీ మాటలు మనకు ముత్యాల మూటలు అవుతాయి కదా! పులకించి పోతున్న మనసుతో ఆ రడుగుల అంత మనిషినీ ఆయన గుండెల్లో చంటి బిడ్డలా ఒదిగిపోయి బావురు మన్నాను.

"టే కెట్ ఈజీ మై బోయ్... జాగ్రత్త. త్వరలో వస్తాను. బేబీ పెళ్లి చూడటానికైనా ఆరోగ్యంతో తిరిగి వస్తాను. బై'' మృదువుగా అంటున్న ఆయన మాటలు రేపటి ఆశాలతకు నీరు పోశాయి.

రైలు మెల్లగా కదులుంటే చేయి ఊపుతూ అనుకున్నాను. 'అవును..ఆయన తప్పక తిరిగి వస్తారు. నా ఆరోగ్యం కోసం మీ దేవుడిని ప్రార్థించమన్న ఆయన, సర్వమత సమానత్వం ప్రదర్శించిన ఆయన ఆ మాట అన్నందుకైనా ఆరోగ్య వంతుడిగా, నా దేవుడు తిరిగి రప్పిస్తాడు. ఎందుకంటే మతాలు వేరైనా మానవు లంతా ఒక్కటే, పే రేదైనా అందరికీ దేవు డొక్కడే కాబట్టి!'

## ఇద్దరూ దొంగలే

***ఒక వ్యక్తి దొంగ నోట్లు ప్రింట్ చేసేవాడు. పొరపాటున ఆరు రూపాయల నోట్లు ప్రింట్ చేశాడు. ఆ నోటును పాన్ షాప్ దగ్గరికి వెళ్లి చిల్లర ఇమ్మన్నాడు. ఆ షాపు అతను వెంటనే రెండు మూడు రూపాయల నోట్లు ఇచ్చాడు.***

**కె. అనంతరామశర్మ [మిర్యాలగూడెం]**